కథా నిలయం
4640
శ్రీకాకుళం

# సృష్టి


.....ఎలా మొదలైందీ అని ప్రశ్నించే కొందరి సందేహం తీర్చాలంటే, చాలా చిన్న సమాధానం – 'అదంతే!' ఆద్యంతాలు తెలియని సృష్టి రహస్యాన్ని శోధించడానికి నిన్నటి మునులు చేసిన తపస్సులూ, నేటి శాస్త్రజ్ఞులు చేస్తున్న శాస్త్ర పరిశోధనలూ సామాన్య మానవులు అర్థం చేసుకోలేని, నమ్మలేని వివరణలకి దారితీసాయే కాని, ఇదమిత్థంగా సమాధానం చెప్పలేకపోయాయి.

అనంత విశ్వవ్యాప్తమైన ఓంకార నాదం నుంచి ఆదిశక్తి ఉద్భవించింది. ఆదిశక్తికి కొంతకాలం తర్వాత విసుగెత్తి 'బ్రహ్మ' అనే పురుష రూపాన్ని సృష్టించి సాంగత్యం కోరింది. 'జన్మనిచ్చిన తల్లివి, అపచారం!' అన్నాడు బ్రహ్మ. ఆదిశక్తి రుద్రనేత్రం తెరిచి బ్రహ్మని కాల్చి బూడిద చేసింది. ఆ తర్వాత విష్ణు రూపాన్ని సృష్టించింది. 'మాతృదేవోభవ' అని నమస్కరించి, ఆదిశక్తి కోరికని నిరాకరించిన విష్ణువు కూడా ఆమె ఆగ్రహానికి గురై భస్మమయ్యాడు. ఆ తర్వాత శివ సృష్టి జరిగింది. శివుడు పక్కనున్న భస్మరాశుల్ని చూసి సంగతి గ్రహించాడు. 'ఏ కారణం చేతో నన్ను విభిన్నమైన పురుష రూపంలో సృష్టించి పొందు కోరుతున్నావు. నీ ఫాలభాగాన ఉన్న మూడో నేత్రాన్ని నాకిచ్చి ఆధిక్యత చేకూర్చు. నీ కోరిక మన్నిస్తాను' అన్నాడు శివుడు దర్పంగా. వేదన భరించలేని ఆదిశక్తి వివేకం నశించి, తన మూడో నేత్రాన్ని శివుని ఫాల భాగానికి చేర్చింది. శివుడా రుద్రనేత్రాన్ని తెరిచి, ఆదిశక్తిని భస్మం చేసి, అన్నలిద్దరికీ మళ్ళీ జీవం పోశాడు.

త్రిమూర్తులు ముగ్గురూ ఒకరినొకరు చూస్తూ తల పంకించారు. స్త్రీ సహచర్యం లేక వారు సంపూర్ణులు కాలేరని గుర్తించారు. వారి శక్తులతో స్త్రీ రూపాల్ని సృష్టించడానికి ప్రయత్నించి విఫలులయ్యారు. విశ్వనాదమైన 'ఓం' కారం పదార్థ రూపం ధరించి ఆదిశక్తిగా మారింది. ఆదిశక్తి తన నుంచి సృష్టించిన త్రిమూర్తులకి, తమలోంచి స్త్రీలని సృష్టించే శక్తి లేకపోయింది. కుప్పగా పడి ఉన్న ఆదిశక్తి బూడిదలోంచి బ్రహ్మ చిటికెడు తీసి, దానితో సరస్వతీ, లక్ష్మీ, పార్వతులను సృష్టించాడు. దోసిలి నిండా భస్మం తీసుకొని బలంగా ఊదాడు. ఆ భస్మమే నక్షత్ర మండలాలుగా, నక్షత్రాల చుట్టూ తిరిగే గ్రహరాశులుగా మారింది. మిగిలిన భస్మాన్ని బ్రహ్మ భద్రపరచి, దానితో అనువైన గ్రహాల మీద తొలి వృక్షరాశుల్నీ, జీవరాశుల్నీ సృష్టించాడు.

దీని సారాంశమేమిటంటే, బ్రహ్మాండంలో ఉన్న సమస్త నక్షత్ర మండలాలు, చరాచర

సుక్ప్రాన్



. Modern protoplanet theory of solar system formation

జీవరాశులూ పరాశక్తి రూపాంతరాలే! లేదా పరబ్రహ్మ స్వరూపాలే! ఈ పురాణ వివరణని కాస్సేపుపక్కగా నెట్టి, నేటి శాస్త్రజ్ఞులేమంటున్నారో కాస్త పరిశీలిద్దాం.


❁ ❁ ❁

☆ అనంతమైన విశ్వమంతా విశ్వధూళితో నిండి ఉండేది. ఆ విశ్వధూళి 'పరస్పరాకర్షణ శక్తి' అంటే గురుత్వాకర్షణ శక్తి మూలాన దగ్గరయి, చెప్పనలవిగాని సాంద్రతగల ఓ ముద్దగా, లేదా బ్రహ్మాండంగా (పెద్ద గుడ్డు) మారింది. ఓ ఘనపు సెంటీమీటరు పదార్థం కొన్ని లక్షల టన్నుల బరువు తూగే ఆ పీడన శక్తి వల్ల అత్యధికమైన ఉష్ణం జనించి, ఒక్కసారిగా విపరీతమైన శక్తితో బ్రహ్మాండం బ్రద్దలై (big bang), ద్రవ్యరాశులు విశ్వమంతా విసిరి వేయబడి, ఒకదానికొకటి దూరంగా పోతూ, ఇవ్వటికీ నిరంతరంగా విశ్వాన్ని వ్యాకోచింపచేస్తున్నాయి. ఆ ద్రవ్యరాశులే కోట్లాది నక్షత్ర మండలాలు. ఒక్కో నక్షత్ర మండలంలో లక్షలాది సౌర కుటుంబాలు. ఒక్కో సౌర కుటుంబానికి నిర్ణీతమైన గ్రహాలు నిర్ధారితమైన వలయాల్లో క్రమం తప్పకుండా, ఆ సౌర కుటుంబ క్షేత్రం మధ్యలో ఉన్న నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. కొన్ని గ్రహాల చుట్టూ ఉపగ్రహాలు పరిభ్రమిస్తున్నాయి.

మన సౌర కుటుంబానికి కేంద్రమైన నక్షత్రమే సూర్యుడు. సూర్యుని చుట్టూ తిరిగే గ్రహాలు మెర్క్యురీ (బుధుడు), వీనస్ (శుక్రుడు), ఎర్త్ (భూమి), మార్స్ (కుజుడు), జుపిటర్ (గురుడు), శాటరన్ (శని) యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో ఇప్పటి వరకూ కనుగొనబడినవి.

ఇలా ఉద్భవించిన సౌర కుటుంబంలోని మూడవ గ్రహమైన మన భూమి మీద, జీవరాశులెలా ఉత్పన్నమయ్యాయీ అని ప్రశ్నిస్తే...

బ్రహ్మాండం బ్రద్దలై, నక్షత్ర మండలాలుద్భవించిన తీరుకు దగ్గరగానే, సూర్యుడి నుంచి కూడా గ్రహరాశులు ఉత్పన్నమయ్యాయి అని చెప్పుకొంటే సత్యదూరం కాదు. కల్లోలావృతమైన కణ మేఘాల నుండి సౌర కుటుంబం జనించింది. సూర్యుడిలోనూ, భూమిలోనూ, ఇతర గ్రహరాశుల్లోనూ ఉన్న మూల ధాతువులన్నీ ఈ కణజాలంలో ఉన్నాయి. ఈ మేఘాలలో బరువైన లోహ ధాతువులతో సహా, తేలికైన వాయురూప మిశ్రమాలు కూడా ఉన్నాయి. వర్తులాకారంలో తిరుగుతున్న ఈ మేఘాలు గురుత్వాకర్షణ శక్తి మూలాన దగ్గరవడం ప్రారంభించి, కేంద్రంలో ఉన్న పదార్థ మూలంలో విపరీతమైన ఉష్ణం జనించి, అణు విస్ఫోటక శక్తికి




వ్యతిరేకమైన అణుసంధాన ప్రక్రియకు నాంది పలకడంతో, కేంద్ర పదార్థం మండడం ప్రారంభించి, సూర్యుడవతరించాడు. ఉదజని హీలియంగా మారే ఈ ప్రక్రియలో ప్రచండ వేగంతో పయనించే సౌర వాయువులు సూర్యమండలం నుంచి వీచసాగాయి.

సూర్యునికి దగ్గరగా ఉన్న చిన్న చిన్న మేఘ శకలాలు అప్పటికే గ్రహరాశులుగా సూర్య ప్రదక్షిణలు చేస్తున్న సమయంలో ఈ సౌర వాయువులు గ్రహరాశులు చుట్టూ ఉన్న మిశ్రమ వాయువుల్నీ, అందులో ఉన్న ధాతు మూలాల్నీ విసిరి కొట్టినా, అణుభారమున్న ధాతువులన్నీ దగ్గర పడి గ్రహాలేర్పడ్డాయి. ఈ ప్రభావం దూరంగా ఉన్న గ్రహాలు గురు, శని, యురేనస్‌ల కన్నా, దగ్గర వలయాల్లో తిరుగుతున్న బుధ,శుక్ర, భూ, కుజ గ్రహాల మీద అధికంగా ఉండడం వల్ల, ఈ గ్రహాల వాయు మండలం చాలా పల్చగా ఉంటుంది.

భూ మేఘంలో ఉన్న ధాతువులన్నీ దగ్గర పడి, సుమారు 4600 మిలియన్ల సంవత్సరాల క్రితం అంటే 460 కోట్ల సంవత్సరాల క్రితం భూమి ఏర్పడిందని అంచనా.

గురుత్వాకర్షణ పీడనం చేతా, రేడియో ధార్మిక విచ్ఛిత్తి వల్లా వేడెక్కిన భూమధ్యం ధ్రువీకరణ చెందింది. భారమైన లోహాలు - ఇనుము (Iron), నికిలము (Nickle) మొదలైనవి భూ కేంద్రకంలో నిబిడీకృతమైయ్యాయి. తేలిక ధాతువులైన మెగ్నీషియం, అల్యూమినియం, సిలికాన్ లాంటివి కేంద్రకానికి బాహ్య వృత్తాల దగ్గర్నుంచి, భూమి ఉపరితలం వరకూ నిర్మాణ సారథ్యం వహించాయి. కేంద్రకానికి వెలుపలి వృత్తం ద్రవరాశితో నిండి ఉండగా, విపరీతమైన పీడన శక్తి మూలాన కేంద్రకం మరోసారి ఘనీభవించింది. ఘనీభవించిన భూ కేంద్రం, ఉపరితలం - వీటికి మధ్యగా ఉన్న ద్రవరూప ద్రవ్యరాశులూ అన్నీ కలిసి ఓ పెద్ద విద్యుత్ యంత్రంగా పని చేయడం మూలాన, అయస్కాంత శక్తి ఉద్భవించి భూమిని ఆవృతం చేసింది.

భూమిని ఆవరించిన ఈ అయస్కాంత శక్తీ, ఆకాశపు వాయుమండలం పైపొరల్లో కేంద్రీకృతమైన ఓజోన్ వాయువూ, సూర్యనక్షత్రం నుంచి వచ్చే కొన్ని హానికర కాంతి ప్రసరణాల్ని, అణువుల్నీ అవరోధించడమనేది భూ జీవరాశులకి ప్రకృతి యిచ్చిన పెద్ద వరం. ప్రాణోత్పత్తికి

ప్రథమ సోపానమిది.

భూమి పై పొరల్లో 82 భారశాతం ఆక్సిజన్, సిలికాన్, అల్యూమినియంలదే. ఆమ్లజనిదాల రూపంలో ఉన్న ఈ మూడు ధాతువులకు తర్వాత ఎక్కువగా ఉండేది, మొత్తం భూమిలో ఎక్కువ పాలు పంచుకొన్న ఇనుము. జీవరాశుల్లో ప్రధానమైన కర్బన ధాతువు, భూమి పై పొరల్లో లభ్యమయ్యేది నిజానికి చాలా తక్కువ శాతం. ఆదిలో భూమి పైపొరని ఆవరించిన వాతావరణంలో మీథేన్ (కర్బన - ఉదజనుల మిశ్రమ ధాతువు) వాయు భాగంగా ఉండేది.

భూమి పైపొర మొదట్లో కాస్త పల్చగానూ, పెళుసుగానూ ఉండేది. భూమి ఉపరితలం మీద నీరు ఉండేది కాదు. అగ్ని పర్వతాలు ప్రేలినప్పుడు, భూగర్భస్థమైన నీరు కూడా ఆవిరి రూపంలో వెలుపలికి వచ్చి, ఆ తర్వాత ద్రవీభవించి సాగరాలేర్పడ్డాయి.


మొదటి రెండు బిలియన్ల సంవత్సరాల వరకూ – అంటే 200 కోట్ల సంవత్సరాల వరకూ – భూమి సాగర మధ్యస్థంగా చిన్నా, పెద్దా ద్వీపాల రూపంలో ఉండేది. చాలా అగ్ని పర్వతాలున్నా, పెద్ద పెద్ద పర్వతాలని మోసే శక్తి అర్భకంగా ఉన్న భూమిపై పొరలకి అప్పటికింకా లభ్యం కాలేదు. సూర్యకిరణ ప్రభావం వల్ల సముద్రపు నీటి పొరల్లో జరిగిన అనేకానేకమైన సంక్లిష్ట రసాయనక చర్యల వల్ల ఎమీబా లాంటి ఏక కణజీవులూ, ఆల్గే – అంటే నీటి నాచు – లాంటి వృక్ష సంబంధమైనవి తొలిగా ఆవిర్భవించాయి. మరో వంద కోట్ల సంవత్సరాల్లో ఈ వృక్షరాశులూ, జీవరాశులూ అభివృద్ధి చెందసాగాయి. కిరణజన్య సంయోగక్రియ వలన వృక్షరాసులు విపరీతంగా వెలువర్చిన ఆమ్లజని, ముందు పేరాల్లో చెప్పిన మీథేన్‌తో రసాయన ప్రక్రియ చెంది కర్బనద్వి ఆమ్లజనిదమూ, నీటి ఆవిరీ  ఉద్భవించాయి.

ఇదే కిరణజన్య సంయోగ క్రియ. కర్బనద్విఆమ్లజనిదాన్నీ, నీటినీ శరీర నిర్మాణానికీ, శక్తికీ కావలసిన పిండి పదార్థాలు తయారుచేసుకోవడానికి సహాయపడ్డంతో, ఆహార ప్రక్రియ ఓ స్థిర రూపాన్ని దాల్చింది. ఈ విధంగా సూర్యకాంతి, నేల మీది చెట్లూ కలిసి మనకి ఆహారంతో బాటు ప్రాణవాయువుని కూడా అందిస్తున్నాయి.

250 కోట్ల సంవత్సరాల ప్రాంతంలో భూమి పైపొర చాలా మందగానూ, ధృఢంగానూ తయారైంది. కాని భూగర్భ ప్రక్రియల వల్ల నేల, సముద్ర మట్టం పైకి పెరిగింది. పెద్ద పర్వతాలు ఏర్పడ్డాయి. 200 కోట్ల సంవత్సరాల నుంచీ 400 కోట్ల సంవత్సరాల వరకూ ఈ తొలి వృక్షరాశుల తోటి, అల్పజీవుల తోటి నిండిన వసుంధర వాతావరణంలో ప్రాణావసరమైన ఆక్సిజన్‌ని నింపసాగింది.

400 కోట్ల సంవత్సరాల తర్వాత నెమ్మదిగా నేల మీద పెద్ద మలి వృక్షరాశులు పుట్టుకొచ్చాయి. స్పష్టమైన రూపాలతో జల జంతువులూ, ఆ తర్వాత సరీసృపాలూ, రాక్షస బల్లులూ, స్తన్య జీవులూ, పక్షులూ ఒకటొక్కటిగా ఆవిర్భవిస్తూ వచ్చాయి. భారీ శరీరాలు గల జంతువులు ఇప్పటికి 65 మిలియన్ సంవత్సరాల వెనుక ఏదో పెద్ద అవాంతరం వల్ల కాని, తగినంత ఆహారం లభ్యం కాకపోవడం వల్ల కానీ నశించిపోయాయి. ☆

(☆ – ☆ ఈ రెండింటి మధ్య వ్రాసిన దానికి ఆధారం 'డెస్క్ అండ్ డెరిక్ క్లబ్స్'. తుల్సా, ఓక్లహామా, అమెరికా వారి 'ప్రాక్టికల్ పెట్రోలియం జియాలజీ' అనే వ్యాస పరంపరలో, ఒక ఛాప్టరు. – రచయిత)




శాస్త్రజ్ఞులు ఊహించగలిగినంత మేరకు డార్విన్ పరిణామ సూత్రాల ప్రకారం, ఆది మానవుడు వానర జాతి నుంచి పరిణామం చెంది, సుమారు నాలుగు మిలియన్ల సంవత్సరాల క్రితం, భూమి మీద నివసిస్తున్న జీవరాశుల్లో ఆధిక్యత సంపాదించడం కోసం, రక్షణ కోసం రాళ్ళని ఆయుధాలుగా ఉపయోగించాడు.

ప్రగతితోబాటు పతనానికి కూడా నాంది పలికిన రోజు అదే!

భూమి ఆత్మ ప్రదక్షిణాల మూలాన రాత్రింబవళ్ళు ఏర్పడ్డాయి. ఇతర గ్రహాల ఉనికి వల్లా, వాటి వల్ల లోనయ్యే గురుత్వాకర్షణ శక్తి వల్లా, ఓ నిర్ణీతమైన దీర్ఘ వలయ మార్గంలో సూర్య ప్రదక్షిణలు చేస్తున్న భూమికి ఋతువులేర్పడ్డాయి. సమస్త చరాచర జీవరాశులకీ ఓ జీవన మార్గం ఏర్పరచిందీ ఋతువులే. ఇంతకుముందేచెప్పినట్టుగా సూర్యుడూ, భూమీ కలిసి జీవరాశులకి ఆహారాన్నేర్పరిస్తే, నీరు, గాలీ ఆ జీవరాశులకి ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్నాయి. ప్రతి గ్రహం వెనుకా ఏదో ప్రయోజనకారియైన మర్మముంది. జనించిన ప్రతి జీవరాశికీ, వృక్ష రాశికీ భూమి మీద ఏదో లక్ష్యముంది. ఉపయోగముంది.

యుగాది మొదలు కంటికి కనిపించనంత నెమ్మదిగా పరిణామం చెందిన ఈ కోట్లాది సంవత్సరాల దీర్ఘకాల ప్రమాణంతో సరిపోల్చి చూస్తే, జీవరాశుల జనన మరణాల మధ్య నున్న జీవిత కాలం తృటిప్రాయం. అందుకనే సృష్టి రహస్యాన్ని ఛేదించడం ఒక్క జీవిత కాలంలో ఎవరికీ సాధ్యం కాదు. అంతర్ముఖులై సాధనతో అంతరిక్షాన్ని అర్థం చేసుకో ప్రయత్నించిన మునులూ, శోధనతో అధ్యయనం చేసిన శాస్త్రజ్ఞులూ కూడా, మొదట చెప్పిన రీతిగా సామాన్య మానవుడికి కొరుకుపడే రీతిలో సృష్టి రహస్యాన్ని వివరించలేకపోయారు.

శూన్యంలోంచి ఓంకార నాదం ఎలా పుట్టింది? ఓంకార నాదం లోంచి ఆదిశక్తి ఎలా పుట్టింది? విశ్వాంతరాళాల్లో విశ్వధూళి ఎలా అవతరించింది? – ఈ మూల ప్రశ్నలకీ, చెట్టు ముందా, విత్తు ముందా లేక గుడ్డు ముందా, పక్షి ముందా అనే మీమాంసలకీ సమాధానాలు లేవు.

శాస్త్రానికందనిది వేదాంతమని మనకు తెలుసు. అందుకనే, "అదంతే! సృష్టికి ఆద్యంతాలు లేవు!" అని ఓ రెండు ముక్కలు చెప్పి, ఊరుకోవడం ఉత్తమం.

❁ ❁ ❁

శాస్త్రాలు, సృష్టి నిర్మాణం నెమ్మది నెమ్మదిగా, అంచెలంచెలుగా జరిగిందని, జరుగుతోందని చెబుతుండగా, పురాణాల ఆధారంగా బ్రహ్మ దేవుడు లోకాల్నీ, జీవాల్నీ ఒకేసారి సృష్టించాడని చెప్పుకోవాలి. ఆ సృష్టి కార్యాన్ని బ్రహ్మ ఎలా ఆరంభించాడూ, ఆ ప్రయత్నంలో శివకేశవులూ, ముగ్గురమ్మలూ ఏ పాత్ర వహించారూ అన్న మరో ప్రశ్న ఉత్పన్నమవుతుంది. పురాణాల్లో ఈ విషయమై ఏ విధమైన అవగాహనా ఉన్నట్లు అనిపించదు. దశావతారాలని చెబుతున్న లోక రక్షకుడు హరి అవతారాల్లో మత్స్య, కూర్మ, వరాహ, నృసింహ, వామనావతారాలు జీవుల పరిణామ దశల్ని సూచిస్తుందనుకోవచ్చు. అయితే నృసింహావతారం బదులు హనుమంతావతారం కనక ప్రస్తావించి ఉంటే, మానవాకారం ఏర్పడ్డంలో ఓ క్రమం ఏర్పడి ఉండేది. అయితే అవతారాలు ధర్మ సంరక్షణార్థమై హరి దాల్చిన రూపాలు – మానవులూ, దానవులూ మొదట్నించీ ఉన్నారని పురాణాలు చెబ్తున్నాయనుకొంటే, ఈ అవతారాల ప్రసక్తి పక్కకి నెట్టి, 'బ్రహ్మ ఎలా సృష్టి చేసి ఉంటాడు?' అని కనక ఊహిస్తే –

బ్రహ్మ, తను భద్రపరిచిన భస్మం లోంచి కాస్త కాస్త తీస్తూ, ముందుగా ఆదిశక్తి పుత్రులైన తాము ముగ్గురూ, తమ తమ భార్యలతో వేరు కాపురాలు పెట్టడానికి బ్రహ్మలోకాన్ని, వైకుంఠాన్ని, కైలాసాన్ని సృష్టించాడు. ఆ తర్వాత అష్టదిక్పాలకుల్నీ, వారి లోకాల్ని సృష్టించాడు. అనుకూల పరిస్థితులు కలగచేసిన భూమి మీద నీరూ, గాలీ, చెట్లూ, చేమలూ, జల భూ విహంగ చరాల్ని

రకరకాల ఆకారాలతో, గుణాలతో సృష్టించాడు.

చివరగా దాదాపు తమ ఆకృతిలో ఉన్న ద్విపాదులైన మానవుల్ని సృష్టించాడు. ప్రకృతి వైపరీత్యాల నుంచి జీవరాశులను రక్షించే పని హరికి అప్పగించాడు.

"ఒక్కొక్క జాతినే నువ్వు సృష్టించి, అభివృద్ధి చేసుకొంటూ పోతే కప్పలు కప్పలు గానే ఉండిపోతాయి. మానవులు మానవులుగానే ఉండిపోతారు. అన్నీ పరబ్రహ్మ స్వరూపాలే అయినా, ఇది అన్యాయం" అన్నాడు శివుడు.

"అయితే నువ్వు లయకారుడిగా ఉండి, జీవరాశులకి జననం తర్వాత నీ కిష్టం వచ్చినప్పుడు మరణం ప్రసాదించు. కప్పలోంచి దుప్పిలోకి, దుప్పిలోంచి ఆవులోకి, ఆవు నుంచి మానవుడిలోకి, జీవుడు జన్మకో పరకాయ ప్రవేశం చేసేటట్టు జన్మ సూత్రాల్నీ, న్యాయాల్నీ నిర్ణయిస్తాను" అన్నాడు బ్రహ్మ.

"ప్రాణ రక్షణ నాకిచ్చి, ప్రాణ భక్షణ శివుడికిస్తే, నీ ఆజ్ఞలు పరిపాలించడంలో నాకూ, శివుడికీ అనుక్షణం గొడవలు జరుగుతాయి. శివుడు తన కిష్టంవచ్చినప్పుడు లయ కార్యానికి పూనుకొంటే, నా పదవి వృథా!" అన్నాడు విష్ణువు.

"అయితే ప్రతి జీవికీ నిర్ణీతమైన ఆయుర్దాయం పోస్తా. ఆయుర్దాయం తీరిన వెంటనే శివుడు రంగంలోకి దిగవచ్చు" అన్నాడు బ్రహ్మ.

"మరీ నా చేతుల్తో ప్రాణాలు తీయడం అంత బావుండదు!" అన్నాడు త్రినేత్రుడు.

"దక్షిణ దిక్కుకీ, యమలోకానికీ అధిపతి – యముణ్ణి నీ కార్యాలకు ఉపయోగించు" అన్నాడు బ్రహ్మ.

"మరి ప్రాణ రక్షణకి నేను మట్టుకెంతకని పాటుపడగలను?" విష్ణువు ప్రశ్నించాడు.

"ప్రకృతి వైపరీత్యాలు కలగచేయుడానికి ఆస్కారమున్న అగ్నినీ, వాయువునీ, వరుణున్నీ నీ అధీనంలో ఉంచుకో."

"యముడు కూడా మాటిమాటికీ పాశంతో ప్రాణాలు తీయమంటే ఏడుస్తాడు!" అన్నాడు శివుడు.

"అయితే మధ్యలో మధ్యలో అగ్ని, వరుణ, వాయుదేవుల సహాయంతో ప్రళయాల్ని సృష్టించు. మూకుమ్మడిగా ప్రాణ నష్టం జరిగిపోతుంది!"

"వాళ్ళని నా అధిపత్యంలో ఉంచావు. మరువకు అగ్రజా!" అన్నాడు విష్ణువు.

"గొడవ వచ్చి పడ్తోందే! మీ కిద్దరికీ కిందగా దేవేంద్రుణ్ణి నియమిస్తాను. అతను దిక్పాలకుల కందరికీ అధిపతిగా ఉంటాడు. అతడు మీ ఇద్దరి ఆదేశాల్నీ బేరీజు వేసి ఆజ్ఞల్ని పాలిస్తూ ఉంటాడు. మీరిద్దరూ కూడా అతగాణ్ణో కంట కనిపెడుతూ ఉండండి!" అన్నాడు చతుర్ముఖుడు.

"ఈ ఏర్పాటు లయ కార్యక్రమాల్లో కొన్ని ఆటంకాలు కల్పించవచ్చు. అందుకని నాకు మరికొన్ని ఆయుధాలు కావాలి" అన్నాడు శివుడు.

"రోగాల్ని కలిగించే సూక్ష్మ జీవుల్ని సృష్టిస్తాను. ఆ రోగాల సహాయంతో ప్రాణాలు తీయవచ్చు" అన్నాడు బ్రహ్మ.

"సూక్ష్మజీవులక్కూడా ఆహారం కావాలిగా మరి. అవి ఇతర జీవరాశుల శరీరాల్లో మరణ సమయాల్లోనే ప్రవేశిస్తాయన్న నమ్మకమేమిటి? జీవులకి మధ్యలో రోగాలొస్తే నేనేం చెయ్యాలి?"

విష్ణువు ప్రశ్నించాడు.

"అశ్వినీ దేవతల్ని సృష్టిస్తాను. భూమి చుట్టూ తిరిగే చంద్ర ఉపగ్రహాన్ని సృష్టిస్తాను. సూర్యకాంతి చంద్రుని ఉపరితలం మీద పరావర్తనం చెంది, చంద్రకాంతిగా భూమ్మీదకు ప్రసరిస్తుంది. దాని వల్ల వృక్ష రాశుల్లో ఔషధీగుణాలు పుట్టుకొస్తాయి. అశ్వినీ దేవతలు పలు రకాల వనమూలికల్ని అధ్యయనం చేసి, రోగ నివారణకు సహాయపడ్తారు."

"మరి వాళ్ళు ఎవరి అధీనంలో ఉంటారు?"

"వాళ్ళు కూడా దేవేంద్రుని ఆధిపత్యం కింద ఉంటారు. మీరిద్దరూ మీ మీ లోకాల్లో కూర్చుని, కాస్త అప్పుడప్పుడు దృష్టి సారిస్తే చాలు" అన్నాడు బ్రహ్మ.

ఉన్నట్టుండి సరస్వతి ముఖం చిట్లించింది. ఏమిటన్నట్టుగా చూశారందరూ.

"పాలనా వ్యవహారాలన్నీ సృష్టి, స్థితి, లయకారులుగా మీరు ముగ్గురూ బాధ్యతల్ని పంచుకొన్నారు. మేమిలా దిష్టిబొమ్మల్లా ఉండవలసిందేనా?" అన్నది సరస్వతి. లక్ష్మీ పార్వతులు సమర్థించారు.

"నిరంతమూ ప్రాణికోటిని రక్షిస్తూ కూర్చోవాలంటే మాటలు కాదు. ఆత్మ రక్షణకి, ఆహార సంపాదనకీ కావలసిన పరిజ్ఞానాన్ని జీవరాశులకిస్తే మంచిది. వాటి గొడవ అవే చూసుకొంటాయి!" అన్నాడు హరి.

బ్రహ్మ ఒక్కక్షణం ఆలోచించాడు. "సరే, జీవరాశులకి ఆలోచించే శక్తి గల మెదడు నిస్తాను" అన్నాడు తల పంకిస్తూ.

"అన్ని జీవరాశులకీ ఆలోచించే శక్తి యిస్తే. మన రూపాల్లో సృష్టించబడ్డ మానవుల ఆధిక్యత పోతుంది" అన్నాడు శంకరుడు.

"శరీర ప్రమాణంతో పోలిస్తే, పిపీలికం తర్వాత అన్ని జీవరాశుల కన్నా అధికమైన నిష్పత్తిలో మానవులకి మెదడు నిస్తాను" అన్నాడు బ్రహ్మ.

"మీ ధోరణి మీదే గాని, నా మాటకి సమాధానం చెప్పలేదు!" అంది సరస్వతి.

"మానవులకి హరి చెప్పినట్టుగా ఆలోచించే శక్తే కాకుండా, మాట కూడా యిస్తాను. వాగ్దేవిగా వెలుగొంది, విద్యాబుద్ధులను మానవులకి వరప్రసాదం చేస్తూ ఉండు" అన్నాడు బ్రహ్మ. చదువుల తల్లి అయినందుకు సరస్వతి ముఖం విప్పారింది.

"విద్యా, విజ్ఞానం మెదడుకి పదునెక్కిస్తాయే కాని, కడుపులు నింపవు!" లక్ష్మి నోరు విప్పింది.

"అయితే నా శ్రీమతిని ధన ధాన్యాలను మానవులకి ప్రసాదించే అదృష్టదేవతగా నియమించు. ఈ ఏర్పాటు నా కార్య నిర్వహణకి కూడా తోడ్పాటుగా ఉంటుంది." అన్నాడు విష్ణువు.

"తథాస్తు! అదృష్టలక్ష్మిగా వర్ధిల్లు!" అని దీవించాడు బ్రహ్మ.

"మీ యిద్దరి భార్యలకి మంచి పదవులిచ్చేసుకున్నారు! మరి నా భార్య పార్వతి సంగతేమిటి?" శివుడు ప్రశ్నించాడు.

"ఆదిశక్తి అంశ నీ భార్యలో ఎక్కువగా ఉంది. పరాశక్తిగా, జగన్మాతగా, అష్టాదశ శక్తి పీఠాల్లో అనేక రూపాల్లో ప్రతిష్టించబడి, ప్రజల పూజలందుకోమనవయ్యా నీ భార్య పార్వతిని!" అన్నాడు బ్రహ్మ. చిరునవ్వులు చిందిస్తూ.

"లక్ష్మీ సరస్వతులు ప్రజలకి కావల్సినవన్నీ యిచ్చుకుంటూపోతే, ప్రజల బద్ధకస్తులైపోతారు!"

అన్నాడు శివుడు.

"జీవరాశిలో స్వార్థ గుణాన్ని ప్రవేశపెడతాను. నేనూ, నాదీ అనే అహాన్ని కలుగచేస్తాను. ఈ గుణం నిజానికి ప్రగతిని సాధిస్తుంది. ఎందుకంటే, ఇతరులు కన్నా అధికంగా ఉండాలనే భావన ఎంతటి ప్రయత్నాలనైనా చేయిస్తుంది. ఇది ఒక్క ధన విషయంలోనే కాకుండా, అన్ని రకాల ఖ్యాతి సముపార్జన విషయాలకీ వర్తిస్తుంది". అన్నాడు బ్రహ్మ.

"ఆ గుణంతోపాటు, కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాల్ని కూడా ఇవ్వడం మంచిది" అన్నాడు శివుడు.


తన లయ కారక కార్యనిర్వహణా సౌలభ్యం కోసం శివుడు ప్రయత్నిస్తున్నాడని హరి గ్రహించాడు. ఆ మాట పైకి అనకుండా, "ఈ గుణాల్ని అదుపులో పెట్టుకొని, జ్ఞాన మార్గంలో పయనించే వారికి మోక్షాన్ని ప్రసాదిస్తే బావుంటుంది" అన్నాడు విష్ణువు.

"మీరిద్దరూ అన్నట్టుగానే కానిద్దాం" అన్నాడు బ్రహ్మ.

సరస్వతి మళ్ళీ ముఖం ముడుచుకుంది.

"ఏమైంది?" అని ప్రశ్నించాడు బ్రహ్మ.

"మీ తమ్ముళ్ళిద్దరూ వైకుంఠ కైలాసాల్లో కులాసాగా కాలం గడిపేస్తూ, అప్పుడప్పుడూ యింద్రుణ్ణి కాస్త కనిపెడుతూ ఉంటే చాలన్నారు. మరి మీరో? కప్ప దేహం లయం చెంది దాని జీవుడిక్కడికి వస్తే, దుప్పి దేహం తయారు చేసి అందులో ఆ జీవుణ్ణి ప్రవేశ పెట్టాలి. అలాగే దుప్పి జీవుణ్ణి ఆవు దేహంలోకి, ఆవు జీవుణ్ణి మానవ దేహంలోకి ప్రవేశపెట్టి భూలోకానికి పంపుతూ ఉండాలి. ఇలా నిరంతరమూ, దేహాలు లయం చెంది వచ్చే పోయే జీవుళ్ళకి పునర్జన్మలూ, ఉన్నత జన్మలూ యివ్వడానికి బొమ్మలు చేసుకొంటూ, ప్రాణ ప్రతిష్టలు చేస్తూ కూర్చుంటే, నాతో కాపురం చెయ్యడానికి మీకు తీరికా ఉండదు, అలసటతో ఓపికా ఉండదు!" అన్నది సరస్వతి నిష్ఠూరంగా.



"ఆదిశక్తి, బావగారికి చతుర్ముఖాలూ, చతుర్భుజాలూ, యిచ్చి సృష్టించడంలో ఏదో పరమార్థం ఉండే ఉంటుంది. వంతుల వారీగా ముఖాలు, భుజాలు విశ్రాంతి తీసుకొంటూ, సృష్టి కార్యాన్ని నిరంతరమూ కొనసాగించవచ్చు" – లక్ష్మి ఓ చిన్న విసురు విసిరింది.

"నాలుగు ముఖాలతో నువ్వూ, మూడు కన్నులతో శివుడూ నా మీద ఆధిక్యత సంపాదించుకొన్నారు. నువ్వు మానవులక్కూడా నాలుగు చేతులిస్తే, నాకూ వాళ్ళకీ తేడా ఉండదు! అందుకని మానవుణ్ణి రెండు చేతులతోనే సృష్టించు" అన్నాడు హరి.

"మంచి మాట చెప్పావు. మానవులకీ రెండే చేతులుంటయి" అన్నాడు బ్రహ్మ.

"మరో మాట. వాళ్ళకి ముందస్తుగా కాస్త మొదటి మెట్టు జ్ఞానాన్నందిస్తే భావ్యంగా ఉంటుంది."

"చతుర్ముఖాలతోటీ వేదాలని వల్లిస్తాను. వాగ్దేవి ఘంటం పట్టి వ్రాస్తుంది. సరేనా?"

"నా మాటని పక్కదోవ పట్టించారు!" సరస్వతి కాస్త కోపంగా అంది.

చతుర్ముఖుడు చిన్నగా నవ్వుతూ అన్నాడు : "ఈ విషయంలో మనకో న్యాయం, వాళ్ళకో న్యాయం ఉండకూడదు. సమస్త చరాచర జీవరాశుల పునరోత్పత్తికీ, సంతానోత్పత్తికీ మార్గం అప్పుడే నిర్ణయించాను. చెట్లూ, మొక్కలూ, పువ్వుల్ని పూస్తాయి. పువ్వులకీ పువ్వులకీ మధ్య పరాగ సంపర్కం కోసం భ్రమరాల్ని సృష్టిస్తాను. ఆ భ్రమరాల్ని ఆకర్షించడం కోసం పువ్వులకి రంగునీ, వాసననీ, మధువునీ యిస్తాను. భ్రమరాలే కాకుండా వాయువు కూడా యిందుకు తోడ్పడుతుంది. పరాగ సంపర్కం వల్ల పువ్వులు కాయలుగా, ఫలాలుగా ఫలిస్తాయి. వాటిలో విత్తులుంటాయి. ఆ విత్తులు భూమిలో పడితే మొక్కలు మొలుస్తాయి. పునరావృత్తిగా వృక్ష సంపద పెరుగుతుంది.

"చరించే జీవరాశులకి లింగ భేద మేర్పరుస్తాను. స్త్రీ జాతి అండాల్ని విడుదల చేస్తుంది. పురుష జాతి రేతస్సుని ప్రసాదిస్తుంది. ఈ రెండింటి సమ్మేళనంలో సంతానోత్పత్తికి దారితీస్తుంది. నివాసయోగ్యంగా సృష్టించబడ్డ భూమి, వృక్ష సంపద తోటీ, జీవరాశుల తోటీ నిత్య కళ్యాణం పచ్చతోరణంగా ఉంటుంది."

శివుడేదో అనబోయేలోగా హరి అన్నాడు.

"కష్టమూ, నష్టమూ, ప్రయత్నంలో అసఫలతా మానవులకి దుఃఖ కారణాలవుతాయి".

"నువ్వు చెప్పింది నిజం. ఓదార్పు కోసం 'బ్రహ్మరాత' అనేది ఒకటుంటుందని వేదాల్లో వీలు చూసుకొని ప్రస్తావిస్తాను. నిర్ధారితమైన గ్రహాల గతికీ, మానవుల స్థితికీ ముడిపెట్టే జ్యోతిష్కులని కొంతమందిని సృష్టిస్తాను. దిక్పాలకుల దృష్టులు దిక్కుల మీదే కాక, మానవులు నివసించే గృహాల మీద కూడా పడి, గృహవాసుల జయాపజయాల్ని నిర్ణయిస్తాయని చెప్పే వాస్తు శాస్త్రజ్ఞులను సృష్టిస్తాను. అరచేతిలో రేఖల్ని చూసి ఆకాశం చూపించే హస్తసాముద్రికులను సృష్టిస్తాను. శాంతి ప్రవచనాలతో మనుషుల మనసులకు ఊరట కలిగించే మునుల్నీ, సాధువుల్నీ సృష్టిస్తాను. యింకా ఏమైనా అనుమానాలున్నాయా? – అన్నట్లు శివా, యిందాకా ఏదో అడగబోయావు?"

శివుడు కాస్త తటపటాయిస్తూ అన్నాడు.

"అంతా బాగానే ఉంది. వృక్ష సంపద అభివృద్ధికి వాయువూ, భ్రమరాలూ తోడ్పడుతాయి. కాని జీవరాశులు పని కట్టుకొని పునః సృష్టికి ప్రయత్నిస్తాయని నేననుకోను!"

"స్త్రీ పురుష జాతుల మధ్య ఆకర్షణ సృష్టిస్తాను" అన్నాడు బ్రహ్మ.

"దానివల్ల కూడా అట్టే ప్రయోజనముండదు. స్త్రీ పురుష జాతుల సమాగమంలో ఏదో సుఖం లభించాలి. అంతేకాక ఆధిక్యత గల మానవులకన్నా జంతువులూ, విహంగాలూ, తక్కువ సంఖ్యలో ఉంటే బావుంటుంది!"

"సరేలే, సమాగమంలో 'భావప్రాప్తి' అనే అనిర్వచనీయమైన ఆనందాన్ని సృష్టిస్తాను. మానవులకి తప్ప, మిగిలిన జీవరాశులకి, భూమి సూర్యుడి చుట్టూ ప్రదక్షిణ చేసే సంవత్సర కాలంలో ఒక్క మాటే వళ్ళు వేడెక్కుతుంది!" అన్నాడు చతుర్ముఖుడు.

"మీరిద్దరూ కలిసి కొంపని, అదే భూమిని ముంచేశారు!" అన్నాడు హరి.

"ఏమైందని?!" బ్రహ్మా, శివుడూ ఒకేసారి అడిగారు.

"కలియుగం వరకూ వేచి చూడండి. మీకే తెలుస్తుంది!" అన్నాడు విష్ణువు నవ్వుతూ.

ఇదంతా వట్టి అభూత కల్పన అంటే అనండి. ఏదైనా ఎలా జరిగిందో నిర్ధారణగా చెప్పలేనప్పుడు, కాస్త తర్కం ఉపయోగించి 'ఇలా జరిగింది' అని చెప్పుకోవడంలో తప్పేమీ లేదు. కహనే మే క్యా హర్జ్ హై?